క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణం



మాచవరంలో నిర్మించిన సీసీ రోడ్డు

అంబాజీపేట: దీర్ఘకాలికంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని మాచవరం దొమ్మేటివారి పాలెం సిద్ధిబుద్ధి వినాయకుడి ఆలయం నుంచి శివాలయానికి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గతం నుంచి ఈ రహదారిని నిర్మించాలని స్థానిక ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినప్పటికి ఏ అధికారి పట్టించుకోలేదు. రాళ్లు లేచిపోయి నడిచేందుకు వీలులేక, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడి ప్రమాదాల బారిన పడేవారు. వర్షాకాలంలో నానా అవస్థలు పడ్డామని స్థానికులు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమ కష్టాలను గుర్తించి ఈ రహదారిని రూ.16 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు



పెద్దింట్లమ్మ అమ్మవారు ఆలయం వద్ద భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సెలవురోజు కావడంతో స్థానికులతో పాటు వేర్వేరు ప్రాంతాల నుంచి వాహనాల్లో పిల్లాపాపలతో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్‌బాబు

మామిడికుదురు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తగిన కార్యాచరణ చేపట్టాలని మామిడికుదురులో ఆదివారం జరిగిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించారు. మామిడికుదురు ఎంపీపీ స్కూల్ వద్ద జరిగిన సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు అధ్యక్షత వహించారు. ఎస్టీయూ సంఘం నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ నెల 8వ తేదీన ముస్లిం ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇవ్వాలని నిర్ణయించారు. మండల అభయ్ కన్వీనరుగా ఉండ్రు శ్రీరమణ ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కొమ్ముల వీరరాఘవరావు, మట్టా నాగరాజు, బత్తుల రమేష్‌బాబు, వలవల రాజా, వలవల శ్రీబాలాజీ, వడ్డమూడి రాజు, నేల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వారి సేవలు ప్రశంసనీయం



దుర్గారావుకు సాయం చేస్తున్న సభ్యులు

సఖినేటిపల్లి: ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలంకలో గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కంబాల దుర్గారావుకు, సదరు సంస్థ సమకూర్చిన రూ.40 వేల ఆర్థిక సాయాన్ని శివకుమార్, రేపూరి ఏసు నరసింహరాజా చేతుల మీదుగా అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్, మెంబర్ కుక్కల రాము, నాయకులు గుబ్బల శ్రీనివాస్, తాడి సహదేవ్, కౌరు మునేశ్వరరావు, కేతా శ్రీనివాస్, దొమ్మేటి రాము, మామిడిశెట్టి శ్రీనివాస్, దొంగ శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడి మృతి

అంబాజీపేట: స్థానిక ఆయుర్వేద వైద్యుడు, బ్రాహ్మణ సేవా సంఘ సభ్యుడు ఆకొండి సూర్యనారాయణ (భవాని పంతులు) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. భవాని పంతులు 50 ఏళ్ల నుంచి ఆయుర్వేద వైద్యుడిగా ఎంతో మంది రోగులకు వైద్య సేవలందించారని పలువురు పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, అంబాజీపేట బ్రాహ్మణ సేవా సంఘం సంతాపం వ్యక్తం చేసింది.

సమస్యల పరిష్కారానికి కృషి

పి.గన్నవరం: నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమికి ఓట్లేసి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



పలివెల శ్మశానవాటికలో పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మామిడికుదురు చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



అంతర్వేదికరలో కొల్లాబత్తుల సంఘ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న గొల్లపల్లి



జొన్నాడలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



పెదకందాలపాలెం చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న విప్పర్తి వేణుగోపాలరావు

మానవాళి ఉద్ధరణకే క్రీస్తు జననం

- ఘనంగా ఈస్టర్ వేడుక
- సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

అంబాజీపేట: మానవాళిని ఉద్ధరించేందుకే క్రీస్తు జన్మించారని సీపీహెచ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ జల్లి జార్జిపాపఫ్, బ్రదర్ జల్లి విక్టర్‌కుమార్‌లతో పాటు పలువురు చర్చి పాస్టర్లు అన్నారు. మానవాళి పాప పరిహారార్థం శిలువపై క్రీస్తు ఏసు మరణం పొంది మూడో రోజు లేచిన ఏసును స్మరిస్తూ అంబాజీపేట హడ్కో కాలనీలో ఉన్న కల్వరి క్రైస్తవ ప్రార్థన మందిరంతో పాటు మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి గ్రామాల్లోని అన్ని క్రైస్తవ దేవాలయాల్లో జాగరణ పూజలు నిర్వహించారు. పలువురు చర్చి ఫాదర్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలను అనుసరించి సన్మార్గంలో నడవాలని కోరారు. అంతకు ముందు పితరుల సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిల వద్ద క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపనలు చేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఈస్టర్ వేడుకను మండలంలోని ప్రార్థనా మందిరాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఏసుక్రీస్తును స్తుతిస్తూ ఆరాధనలు ఏర్పాటు చేశారు. మగటపల్లి సీయోను ప్రార్థనా మందిరంలో పాస్టర్లు ఉండ్రు మోహనరావు, ఉండ్రు మోజెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో యేసుక్రీస్తు గొప్పతనాన్ని, బైబిల్‌లో పేర్కొన్న వచనాలను భక్తులకు వివరించారు. ప్రార్థనల అనంతరం పలు చర్చిల్లో భక్తులకు అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఈస్టర్ సందర్భంగా పలు గ్రామాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

కొత్తపేటలో..

కొత్తపేట: ఏసుక్రీస్తు పునరుత్థాన పండగ ఈస్టర్‌ను



అంబాజీపేట హడ్కో కాలనీలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఏసుక్రీస్తు శిలువ మరణానంతరం మూడో రోజున సమాధి నుంచి సజీవునిగా తిరిగి బయటకు వచ్చిన పునరుత్థానం పురస్కరించుకుని ఈస్టర్ పర్వదినాన్ని జరుపుకొంటారు. దానిలో భాగంగా ఆదివారం తెల్లవారుజామునే క్రైస్తవులు తమ కుటుంబాల్లో పరమపదించిన పెద్దల సమాధుల వద్దకు వెళ్లి, శుభ్రం చేసి, పుష్పాలు, పూలమాలలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించారు. తమ పెద్దలను స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలా మండలంలోని గ్రామగ్రామానా క్రైస్తవ స్మశాన వాటికల్లో సమాధులను విశేషంగా అలంకరించడంతో కళకళలాడాయి. మృతుల కుటుంబీకులతో పాటు పలువురు పాస్టర్లను తీసుకువెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మహిమాన్వితమైన రోజు ఈస్టర్

సఖినేటిపల్లి: సత్యం పట్ల విశ్వాసానికి ఉన్న శక్తిని తెలిపిన మహిమాన్వితమైన రోజు ఈస్టర్ అని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా అంతర్వేదికర కలిదిండివారి మెరకలో రెండు



కొత్తపేట లూథరన్ చర్చి ఈస్టర్‌లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి

చర్చిల్లో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొల్లాబత్తుల సంఘం నిర్వహణలోని చర్చిలో ఈ మేరకు పాస్టర్ కొల్లాబత్తుల శ్యామ్ ఆశీర్వాదాలు పలికారు. పునరుత్థానుడైన క్రీస్తు ఆశీర్వచనాలు ప్రతి కుటుంబానికి కలగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేవుని దయతో అందరి హృదయాల్లో శాంతి, ఆనందాలు నింపాలని క్రీస్తు ప్రభువును గొల్లపల్లి ప్రార్థించారు. క్రైస్తవ సోదరులు, సోదరీమణులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ చేసుకున్నారు. ఆలమూరులోని కాలిబాట వంతెన సమీపాన ఏటిగట్టు పక్కన ఉన్న సమాధులతో పాటు జొన్నాడ, పినపళ్ల, సంధిపూడి, బడుగువానిలంక తదితర గ్రామాల్లోని శ్మశాన వాటిక సమాధుల వద్దకు క్రైస్తవులంతా తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తమ రక్త సంబంధీకులను స్మరించుకుని వారి ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు. ఆయా గ్రామాల్లోని మత ప్రార్థనాలయాల్లో ఈస్టర్ వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

ప్రేమపథమే ఏసుతత్వం

కొత్తపేట: ప్రేమపథమే ఏసుక్రీస్తు తత్వమని, తోటి వారందరినీ ప్రేమించాలని, కక్షలు, కార్పణ్యాలకు అందరూ దూరంగా ఉండాలని ఏసు చాటి చెప్పారని ఎమ్మెల్యే, స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక లూథరన్, మన్నా చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో జగ్గిరెడ్డి పాల్గొన్నారు. క్రైస్తవులకు ఈస్టర్ పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. హింసా ద్వేషాలు మరణాన్ని ఇస్తే.. ప్రేమ, క్షమాపణలు జీవితాన్ని ఇస్తాయని నిరూపించడానికి సమాధి నుంచి ఏసుక్రీస్తు సజీవుడై తిరిగి వచ్చాడన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం మానవాళికి మార్గదర్శకమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని సద్గుణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఆయా చర్చిల పాస్టర్స్, మత పెద్దలు అన్ని విధాలుగా జగ్గిరెడ్డికి జయం కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి ప్రార్థనలు చేయాలి

పి.గన్నవరం: ప్రపంచ శాంతికి అందరూ ప్రార్థనలు చేయాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. నాగుల్లంక శివారు పెదకందాలపాలెం న్యూజెరూషలెం ప్రార్థనా మందిరంలో రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో జరిగిన ఈస్టర్ పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దానియేలు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి పాప పరిహారార్థం ఏసుక్రీస్తు శిలువపై చనిపోయి, మూడో రోజున మరణాన్ని జయించి తిరిగి లేచారని వివరించారు. సంఘ కార్యదర్శి యు.జాన్‌బాబు, జె.కరుణకుమార్, నల్లి శ్రీచరణ్, ఫిలిప్ గిరీష్, వందలాది మంది క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాకకు సత్కారం



అంతర్వేదికరలో ఒక చర్చిలో ఎంపీ అభ్యర్థి రాపాకను సత్కరిస్తున్న నిర్వాహకులు

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలోని కలిదిండి వారి మెరకలోని చర్చిలో ఆదివారం వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును, సంఘ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈస్టర్ పవిత్ర దినం సందర్భంగా చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రాపాక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈస్టర్ మనందరి జీవితాల్లో శాంతి, దయ, ప్రేమను నింపాలని ఆయన ఆకాంక్షించారు. కాగా అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఐపీసీ చర్చిలో ఈస్టర్ పండగను ఘనంగా నిర్వహించారు. చర్చి సంఘం ఆధ్వర్యంలో పాస్టర్లు ఎం.సిరిల్, కె.ఏసయ్యలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షకుడైన ఏసు శిలువ వేసిన రోజు గుడ్ ఫ్రైడేగాను, క్రీస్తు ప్రభువు మరణాన్ని జయించి తిరిగి లేచిన రోజున ఈస్టర్(పునరుత్థాన పండుగ)గాను జరుపుకుంటామని పాస్టర్లు పేర్కొన్నారు. సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



తూర్పుపాలెంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతల ముఖ్యమంత్రి అని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుపాలెం గ్రామం నుంచి టీడీపీకి చెందిన అనేక మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ గొల్లపల్లి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బూటకపు హామీలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనే ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీరావు, తాడి కేశవ, నల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కన్వీనర్లు, కోర్ కమిటీలదే కీలకపాత్ర



సఖినేటిపల్లిలో కన్వీనర్లు, కోర్ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బూత్ కోర్ కమిటీల సభ్యులు, గ్రామ సచివాలయం కన్వీనర్లదే కీలకపాత్ర అని వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులు అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలో మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం కన్వీనర్లు, బూత్ కోర్ కమిటీల సభ్యులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రతి ఓటు పూర్తి సద్వినియోగం అయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పార్టీ అభిమానుల ఓట్లతో పాటు తటస్థ ఓటర్లను చైతన్యపరిచి, వారి ఓట్లను కూడా పార్టీకి చేర్చేలా కృషి చేయాలన్నారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక మాట్లాడుతూ, అభ్యర్థుల గెలుపుతో పాటు, పార్టీకి మెజార్టీ తీసుకువచ్చే బాధ్యత కన్వీనర్లు, కోర్ కమిటీ సభ్యులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఓటింగ్ సరళి పెంచుకునేందుకు ముందుగా తగిన వ్యూహం సిద్ధం చేసుకోవాలన్నారు. దాని ప్రకారం ఓటు చేయించుకుంటే పార్టీ అభ్యర్థులకు, పార్టీకి ఎంతో లాభం చేకూరుతుందన్నారు. సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పార్టీ నాయకులు బండారు కాశీ, సూరిశెట్టి బాబీ, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కొత్తపూల ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ముఖ మండపం ఆవరణలో శనివారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం నుంచి తీసుకువచ్చిన మోదుగపూలతో అలంకరించిన పెద్దగరగతో ఐదో విడత కొత్తపూల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ అర్చకుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన గరగ నృత్యాలు భక్తులను అలరించింది. చిన్నారుల చేసిన గరగ నృత్యాలు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. పూలగరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.



చింతలూరులో నిర్వహించిన కొత్తపూల ఉత్సవంలో ప్రదర్శిస్తున్న గరగ నృత్యాలు

టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటిస్తే నేరమా?

- చంద్రబాబుకు మతిభ్రమించింది
- మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: నిరుపేద సామాన్యుడు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన టిప్పర్ డ్రైవర్ అయిన అనంతపురం జిల్లా శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వీరాంజనేయులకు సీటు ఇవ్వడం ఏమైనా నేరమా అని మాజీ మంత్రి, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రశ్నించారు. తాటిపాకలో ఆయన స్వగృహం వద్దకు వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చి గొల్లపల్లిని మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ మద్దతును తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. అందుకే చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుని పూర్తిగా మతిభ్రమించిందన్నారు. సొంత మామ దివంగత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పీటమెక్కిన చంద్రబాబు దళితవర్గానికి చెందిన టిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇస్తే వ్యంగ్యంగా మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. దళితులుగా ఎవరూ పుట్టాలనుకోరని, బీసీలు న్యాయమూర్తులుగా పనికిరారంటూ చంద్రబాబు అనేక సందర్భాల్లో దళితులను, బీసీలను అవమానిస్తూనే ఉన్నారన్నారు. కుటుంబ పోషణకు ఎంఏ, బీఈడీ చదివిన వీరాంజనేయులు చంద్రబాబు హయాంలో ఉద్యోగం రాకపోవడంతో టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగించాడన్నారు. పదే పదే చంద్రబాబు అవమానాలకు గురవుతున్న దళితులు, బీసీలు ఏకమై రాబోయే ఎన్నికల్లో టీడీపీని బంగాళాఖాతంలో కలిపివేయడం ఖాయమన్నారు.



వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లిని కలసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాంబాబు మృతి పార్టీకి తీరని లోటు



వానపల్లిలో రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: ఎంపీటీసీ మాజీ సభ్యుడు వనుము రాంబాబు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని ఎమ్మెల్యే, కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన రాంబాబు మార్చి 28 రాత్రి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వానపల్లిలో రాంబాబు స్వగృహానికి వెళ్లి అతని కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శోకసంద్రంలో ఉన్న రాంబాబు భార్య, కుమారుడు, కుమార్తెను ఓదార్చి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాంబాబు చిత్రపటం వద్ద పుష్పాలుంచి ఘనంగా నివాళులర్పించారు. జగ్గిరెడ్డి వెంట డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్ బండారు రాజా, వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, కొత్తపేట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్

సఖినేటిపల్లి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలంక శివారు చింతావారి గ్రూపులో స్థానికులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ ఆయా సామాజిక వర్గాలకు అమలు చేసిన పథకాలతో తలెత్తుకుని నిలబడేలా చేశారన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు ముత్యాల నాని, నల్లి డేవిడ్, కొల్లాబత్తుల కుమార్, నడింపల్లి వెంకట సుబ్బరాజు, నల్లి సుదీర్ పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ పరిధిలోని సాకావారిపేటలో వేంచేసిన వీరభద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం వీరభద్రస్వామి సంబరం వైభవంగా జరిగింది. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, పల్లకి ఊరేగింపు నడుమ గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఉదయం స్వామిని మేలు కొలిపి అనంతరం వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద పిల్లి నాగరాజు, మంగ దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. భక్తులు వీరభద్రస్వామి నిప్పుల గుండం తొక్కారు. సాకా ఏడుకొండలు, ఈశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సంబరం ఆద్యంతం కనులపండువలా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు.



అప్పనపల్లిలో వీరభద్రస్వామి సంబరంలో పాల్గొన్న భక్తులు

వృత్తికి వన్నె తెచ్చిన మాణిక్యం

ఆలమూరు: అంకిత భావంతో పనిచేసి ఎందరో విద్యార్థులను తన తెలుగు బోధనలతో ఉన్నత శిఖరాలకు చేర్చిన కమిడి మాణ్యిం ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జొన్నాడలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న మాణిక్యం మాస్టార్ ఉద్యోగ విరమణ శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు పెద్దింటి అనంత శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అనేక ఉపాధ్యాయులు పాల్గొని మాణిక్యం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన గత 39 ఏళ్లలో విద్యార్థుల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. రచయిత మల్లిక్ రూపొందించి చదివి వినిపించిన సన్మాన పత్రం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం హైస్కూల్ ఉపాధ్యాయ బృందం, జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో మాణిక్యం, భార్య మేరీగ్రేస్ దంపతులకు ఘనంగా సత్కారం జరిగింది. ఆ దంపతులకు పూలమాలలు వేసి దుశ్శాలువా వేసి మెమెంటోను బహూకరించి నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మల్లికా దేవికి ఘన సత్కారం జరిగింది. ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం, కళాశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రిన్సిపాల్ మల్లికాదేవికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించిన మల్లికాదేవి సేవలను పలువురు వక్తలు కొనియాడారు



జొన్నాడలో మాణిక్యం మాస్టర్ దంపతులను ఘనంగా సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పేదలపై ఎందుకంత కక్ష



తమ్మన శ్రీనివాసు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దనే పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై టీడీపీ నేతలకు అంత కక్ష ఎందుకని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు వ్యాఖ్యానించారు. మండలంలోని చెముడులంకలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుచరుడు మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ ప్రసాద్‌తో కోర్టులో కేసు వేయించి గ్రామ వలంటీర్ వ్యవస్థను ఎన్నికల కోడ్ పేరిట తాత్కాలికంగా నిలిపివేయడం దురదృష్టకరమన్నారు. టీడీపీ నేతల చేస్తున్న కుటిల రాజకీయాలు పెత్తందార్ల పోకడలను తలపిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో మాదిరిగా గ్రామ పంచాయతీల చుట్టూ తిరిగే పరిస్థితిని కల్పించిన టీడీపీని ప్రజలే రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం చేస్తారన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని, మళ్లీ వలంటీర్ వ్యవస్థ పునరుద్ధరించడం ఖాయమని ఆయన ఉద్ఘాటించారు.